సాక్షి కామారెడ్డి

గురువారం । 3 । జూలై । 2025



పౌష్టికాహారాన్ని అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

- 8లో ▸



బీజేపీని బలోపేతం చేయాలి

బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కోరారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం 30.7 /21.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బాన్సువాడ రూరల్ సీఐగా తిరుపయ్య

కామారెడ్డి క్రైం: పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ వన్ ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బాన్సువాడ రూరల్ సీఐగా పనిచేస్తున్న రాజేశ్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జిల్లా పోలీసు కార్యాలయం స్పెషల్ బ్రాంచ్ సీఐగా ఉన్న తిరుపయ్యను నియమించారు.

'నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు'



పెద్దకొడప్‌గల్: నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ విక్టర్ రైస్‌మిల్లుల యజమానులను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని రైస్ మిల్లును తనిఖీ చేశారు. మిల్లుకు కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు మిల్లింగ్ చేసిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా రైస్ మిల్లు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్, డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యలను పరిష్కరించాలి'



బిచ్కుంద: భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులలో తీసుకున్న అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ విక్టర్ సూచించారు. బుధవారం బిచ్కుంద తహసీల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రెవెన్యూ సదస్సులలో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకుని శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పోడు భూముల సమస్యలను భూ భారతి చట్టం ప్రకారం పరిష్కరించి అన్ని హక్కులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ భరత్ ఉన్నారు.

అటవీ భూములు కబ్జా చేస్తే జైలుకే..

లింగంపేట: అటవీ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సెక్షన్ అధికారి భాస్కర్ హెచ్చరించారు. బుధవారం మెంగారం అటవీ ప్రాంతంలో కబ్జా అయిన భూముల్లో కందకాలు తవ్వించారు. రెండు రోజులుగా ముస్తాపూర్ బీట్‌లో 15 ఎకరాలు, మెంగారం సెక్షన్ పరిధిలోని బాణాపూర్ తండా శివారులో 7 ఎకరాల ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తండాకు చెందిన నలుగురు వ్యక్తులు అటవీ భూముల్లో చెట్లు నరికి పంటల సాగుకు సిద్ధం చేశారని, వారిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్స్ శ్రీజ, శేఖర్, పర్వీన్, నవ్య పాల్గొన్నారు.



● జలకళ

మండలంలో రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పెద్దవాగు జలకళను సంతరించుకుంది. బుధవారం ఉదయం నుంచి ప్రవహిస్తోంది. వాగు ప్రవహిస్తుండడంతో మత్తడి కాల్వ పారుతోంది. కాల్వ నుంచి వస్తున్న నీరు ఊర చెరువుల్లోకి ప్రవేశిస్తోంది. దీంతో పెద్దవాగు పరీవాహక ప్రాంత రైతులు, చెరువుల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – లింగంపేట

జైన కళ

- చాతుర్మాస్య దీక్షలు ప్రారంభం



జైన చాతుర్మాస్య ఉత్సవాల్లో పాల్గొన్న జైన గురువులు, జైనులు

కామారెడ్డి అర్బన్: ఆషాఢం నుంచి కార్తీక మాసం వరకు చాతుర్మాస్య నియమాలు పాటించడం ద్వారా ఆధ్యాత్మికంగానే కాకుండా ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు జరుగుతుందని జైన గురువులు పేర్కొన్నారు. కామారెడ్డి శ్రీవర్ధమాన్ మహావీర్ జైన్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక సిరిసిల్లరోడ్డులోని జైన సంఘ భవనంలో చాతుర్మాస్య దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైన గురువులు సంస్కార్ ప్రవర్తక్ సిద్ధార్థ మునీజీ, సౌమ్యాజీ, రిద్ధిశ్రీజీ, లలిత్ ప్రభ శాంతి ప్రియాజీ మాట్లాడారు. చాతుర్మాస్య ఉత్సవాల విశిష్టతను వివరించారు. ఒక పూట మాత్రమే ఆహారం తీసుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతో గడపాలని సూచించారు. ఉత్సవాల్లో భాగంగా జైన సంఘం భవనంలో రోజూ ఉదయం 9 గంటల నుంచి గంట పాటు ప్రవచనాలు ఉంటాయని జైన్ సంఘం అధ్యక్షుడు కమల్‌చంద్ జైన్ తెలిపారు. గురువుల దర్శనం కోసం మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి నాలుగు నెలల పాటు భక్తులు వస్తారని, వారికోసం ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దిలీప్‌చంద్, మహేష్, ప్రదీప్‌కుమార్ జైన్, పునంచంద్, రికబ్‌చంద్, సురేష్‌చంద్ పాల్గొన్నారు.

పురం.. 'స్వచ్ఛ'తకు దూరం

సాక్షి ఫోకస్

జిల్లాకేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. తడి, పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పలు కాలనీలలో పక్కా డ్రెయినేజీలు లేవు.. ఉన్న మురికి కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఆయా కాలనీలు కంపుకొడుతున్నాయి.

– కామారెడ్డి టౌన్



టీచర్స్ కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త, రోడ్డుపై పారుతున్న మురుగునీరు

- బల్దియాలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- తడి, పొడి.. కలిపే సేకరణ
- పలు కాలనీలలో కానరాని పక్కా డ్రెయినేజీలు
- పూడుకుపోయిన మోరీలు.. రోడ్లపైకి మురుగు పరుగు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



రాజీవ్‌నగర్‌లో మురికి కాలువ లేక రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు



పట్టణంలోని వీక్లీమార్కెట్ రోడ్‌లో నిలిచిన మురుగునీరు

కామారెడ్డి మున్సిపాలిటీలో 25 వేలకుపైగా గృహాలున్నాయి. పట్టణ జనాభా లక్ష దాటింది. పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. అయితే అభివృద్ధి మాత్రం అంతంత మాత్రంగానే జరుగుతోంది. పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలతో పట్టణం చెత్త కుప్పలా కనిపిస్తోంది. శివారు కాలనీలతోపాటు గోదాంరోడ్, రాజీవ్‌నగర్, ఇందిరానగర్, డ్రైవర్స్‌కాలనీ, డబుల్‌బెడ్‌రూం, టీచర్స్‌కాలనీ, గాంధీనగర్, బతుకమ్మకుంట, రుక్మిణికుంట, శ్రీరాంనగర్‌కాలనీ, వికాస్‌నగర్, గొల్లవాడ, కిష్టమ్మగుడి, పెద్ద కాలనీ, వీక్లీమార్కెట్, అయ్యప్పనగర్, హరిజనవాడ, గ్రీన్ సిటీ తదితర కాలనీలలో కూడళ్లు, ఖాళీ స్థలాలలో చెత్త పడేస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. ఓపెన్ స్థలాలైతే డంపింగ్ యార్డులుగా మారాయి. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి.

డ్రెయినేజీ సమస్య..

పట్టణంలో చాలా కాలనీలలో ఇంకా పక్కా సీసీ డ్రెయినేజీలు లేవు. రోడ్లపైనే మురుగు నీరు పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. డ్రెయినేజీలు ఉన్న చోట కూడా సమస్యలున్నాయి. కొన్నిచోట్ల నెలల తరబడి డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదు. దీంతో మురుగు నిండి రోడ్లపైకి వస్తోంది. వర్షాకాలం కావడంతో మురికి నీటి ప్రవాహం ఎక్కువై రోడ్లపైకి వస్తుండడంతో కాలనీలు కంపు కొడుతున్నాయి. దోమలతోపాటు కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన రోడ్ల శుభ్రత పైనే అధికారులు దృష్టి సారించడంతో కాలనీలు 'స్వచ్ఛ'తకు దూరమయ్యాయి.

'తడి–పొడి'.. అంతా భ్రమ

బల్దియా సానిటేషన్ విభాగంలో 19 ఆటోలు, 5 ట్రాక్టర్లు ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సి ఉంటుంది. కానీ పట్టణంలో ఈ విధానం ఎక్కడా అమలు కావడం లేదు. తడి, పొడి చెత్తను కలిపే సేకరిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, బయోవేస్టేజ్, మాంసపు వర్థాలు, వంటింటి తడి చెత్త వ్యర్థాలు ఇలా అన్నీ కలిపి సేకరిస్తున్నారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడంతో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. డంపింగ్ యార్డు వద్ద కూడా తడి పొడి చెత్తను వేరు చేయడం లేదు.

మొక్కుబడిగా పనులు..

సానిటేషన్ విభాగంలో ఒక రెగ్యులర్ సానిటరీ ఇన్‌స్పెక్టర్, ఒక ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. 49 వార్డులకు కేటాయించిన వార్డు ఆఫీసర్లు అసలు సానిటేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. వారు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదు. 14 మంది జవానులున్నా.. కార్మికులకు పనులు అప్పగించి వెళ్లిపోతారని, మొక్కుబడిగా పనులు చేస్తారని విమర్శలున్నాయి. కార్మికులు చాలా మంది రోజూ డుమ్మాలు కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వచ్చిన కార్మికులు సైతం సరిగా పనులు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు దృష్టి సారించి పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపడేలా చూడాలని కోరుతున్నారు.



డ్రైవర్స్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పక్కన మురికి కాలువ

ఏళ్లుగా ఇదే పరిస్థితి..



మా ఇళ్ల పక్కన మురికి కాలువ అధ్వానంగా ఉంది. రోడ్లపైకి మురుగు నీరు వస్తోంది. దీంతో దోమలు, ఈగలు విపరీతంగా ఉంటున్నాయి. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు తరచూ జ్వరాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీ నిర్మించాలి.

– ఎండీ. మక్బూల్, టీచర్స్ కాలనీవాసి

శుభ్రం చేయడం లేదు



రోడ్లను నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. మురికి కాలువలను సైతం శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి విషప్రాణులు సంచరిస్తున్నాయి. మోరీల్లోంచి చెత్తను తీసి రోడ్లపై వేస్తారు. వారం రోజులైనా తీయరు.

– నర్సింలు, వీక్లీ మార్కెట్‌వాసి

ముక్కు మూసుకుంటున్నాం



సిరిసిల్ల రోడ్‌లో ఉన్న మురికి కాలువల్లో మాంసం వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అధికారులు స్పందించి మురికి కాలువల్లో మాంసం వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– మల్లేశ్, సిరిసిల్ల రోడ్‌వాసి

స్పెషల్ డ్రైవ్ చేపడతాం..

అన్ని వార్డులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా సానిటేషన్ సమస్యలుంటే ప్రజలు నేరుగా మాకు ఫిర్యాదు చేయాలి. తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సానిటేషన్ సమస్యలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆయా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

'ఇందిరమ్మ'కు ధరాఘాతం

- జిల్లాకు 11,489 ఇళ్లు మంజూరు
- 5,246 ఇళ్లకు మార్కింగ్ పూర్తి
- స్లాబ్ లెవల్‌కు చేరింది 17 ఇళ్లే..
- రూఫ్ లెవల్‌కు 69..
- బేస్‌మెంట్ లెవల్‌లో మరో 449 నిర్మాణాలు..
- పెరిగిన స్టీల్, సిమెంట్, ఇసుక ధరలతో ముందుకు రాని లబ్ధిదారులు



వజ్జపల్లిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

సదాశివనగర్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి ధరాఘాతం తగిలింది. పెరిగిన స్టీల్, సిమెంట్, ఇసుక ధరల కారణంగా ఇళ్ల నిర్మాణానికి చాలా మంది లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీంతో జిల్లాలో నిర్మాణాలు వేగం పుంజుకోవడం లేదు.

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చింది. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకంలో ఇళ్లను మంజూరు చేస్తోంది. తొలి విడతలో జిల్లాకు 11,489 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 5,246 గృహాలకు మార్కింగ్ పూర్తయ్యింది. ఇప్పటివరకు 17 ఇళ్లు మాత్రమే స్లాబ్ లెవల్‌కు చేరాయి. 69 గృహాలు రూఫ్ లెవల్‌లో ఉండగా 449 నిర్మాణాలు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. మిగతావాటి పనులు ముందుకు సాగడం లేదు.

అప్పుల పాలవుతున్న నిర్మాణదారులు

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వివిధ దశలలో బిల్లులు చెల్లిస్తుంది. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయితే లక్ష రూపాయలు ఇస్తుంది. రూఫ్ లెవల్ వరకు పూర్తయితే రూ. 1.25 లక్షలు, స్లాబ్ వేస్తే రూ. 1.75 లక్షలు, రంగులు వేసిన తర్వాత మిగిలిన లక్ష రూపాయలు అందిస్తుంది. అయితే పెరిగిన ధరలతో ఇంటి నిర్మాణ వ్యయం కూడా గణనీయంగా పెరుగుతోంది. దీంతో నిర్మాణదారులు ఇబ్బందిపడుతున్నారు. మరోవైపు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ముందుగా డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పులు తేవాల్సి వస్తోంది. ఇది వారికి మరింత భారంగా మారుతోంది. దీంతో చాలా మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ధరలు పైపైకి...

ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఐరన్ ధరలు గణనీయంగా పెరిగాయి. గతేడాది అక్టోబర్‌లో సిమెంట్ బస్తా ధర రూ. 250 నుంచి రూ. 300 వరకు ఉండగా.. ప్రస్తుతం రూ. 330 నుంచి రూ. 360కి విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక ధర రూ. 2 వేలనుంచి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇటుక, స్టీల్, కలప ధరలూ గణనీయంగా పెరిగాయి.

విపరీతంగా ధరలు పెరిగాయి



ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యిందని మురిసినం. ఇంటి నిర్మాణం చేపట్టినం. సిమెంట్, ఇసుక, సలాక ధరలు మస్తు పెరిగినయి. ఒక సలాక కోసమే రూ. లక్ష అయినయి. సిమెంట్ కూడా మస్తు పెరిగింది. ఇబ్బందిగా ఉంది.

– సొకలి సాయిలు, లబ్ధిదారు, ధర్మారావ్‌పేట్

ప్రోత్సహిస్తున్నాం..

మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులను గుర్తించాం. కొన్నిచోట్ల పనులు ప్రారంభించాం. ఇప్పటికీ ఇంకా మార్కింగ్ చేసే కార్యక్రమం కొనసాగుతోంది. ఇల్లు మంజూరైనవారు నిర్మాణాలు చేపట్టుకునేలా ప్రోత్సహిస్తున్నాం. పనులు ప్రారంభించిన వారికి నిబంధనల ప్రకారం బిల్లులు మంజూరు చేస్తున్నాం.

– విజయపాల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ, కామారెడ్డి

కనుల పండువగా రథయాత్ర



జగన్నాథ రథయాత్రలో కళాకారుల వేషధారణ

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం శ్రీజగన్నాథ రథయాత్రను కనుల పండువగా నిర్వహించారు. విద్యానగర్ సాయిబాబా ఆలయం చౌరస్తా వద్ద రథయాత్ర ప్రారంభమైంది. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సిరిసిల్ల రోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయం వరకు రథయాత్ర సాగింది. వడోదర ఇస్కాన్ ప్రతినిధులు వాసుగోష్ ప్రభు, వెంకటదాసు ప్రభు, పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి, వీహెచ్‌పీ ప్రతినిధులు, భక్తులు భారీ సంఖ్యలో రథయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరేకృష్ణ, జై జగన్నాథ నామస్మరణతో పుర వీధులు మారుమోగాయి. నవీపేటకు చెందిన చందు సాయన్న చిందు కళాకారుల బృందం దేవతామూర్తుల వేషధారణతో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

'సహకారం'తో రైతులు, కార్మికులకు ప్రయోజనం



మాంచెస్టర్‌లో ప్రసంగిస్తున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: సహకార వ్యవస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా రైతులు, కార్మికులు, వ్యాపారులు లాభపడుతున్నారని ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ అలయెన్స్ (ఐసీఏ) ఆధ్వర్యంలో లండన్‌లోని మాంచెస్టర్ నగరంలో కో ఆపరేటివ్ యాక్టివిటీస్ అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్ (ఎన్ఏఎఫ్ఎస్‌సీఓబీ) తరఫున కుంట రమేశ్‌రెడ్డి సదస్సుకు హాజరై ప్రసంగించారు. యూఎన్‌వో 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించినందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహకార సంస్థలు రైతులకు అనేక రకాల సేవలు అందిస్తున్నాయని, గ్రామీణ వ్యవస్థకు మూలాధారంగా ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అందిస్తున్న సౌకర్యాలను రమేశ్‌రెడ్డి వివరించారు.

క్లుప్తంగా

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని స్టడీ సెంటర్ ఇన్‌చార్జి, కల్వరాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ చదువుతూ మధ్యలో ఆపేసిన వారు, ఫెయిల్ అయిన వారికి ఇదొక సువర్ణ అవకాశమన్నారు. టెన్త్, ఇంటర్‌లో హెచ్‌ఈసీ, సీఈసీ(ఆర్ట్స్ గ్రూప్)లో చేరి పూర్తి చేసుకోవాలన్నారు. పాస్ పోర్టు సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, రికార్డు షీట్/టీసీలతో పాటు పాఠశాలలో సంప్రదించాలన్నారు. టెన్త్‌లో చేరే ఓసీ పురుషులు రూ.1,400, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పురుషులు, స్త్రీలు రూ.1,000 తో పాటు ఆన్‌లైన్ చేయడం కోసం అదనంగా రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్‌లో చేరే ఓసీ పురుషులకు రూ.1,500, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.1,200లతో పాటు ఆన్‌లైన్ చేయడం కోసం రూ.300 అదనంగా చెల్లించాలన్నారు. ఈ నెల 11లోగా అడ్మిషన్ పొందాలన్నారు. పూర్తి వివరాలకు 9490170646-సతీష్‌కుమార్, పూర్ణారావు-7382244764, నందురావు సీఆర్‌పీ-9440475762 లను సంప్రదించాలని కోరారు.

అసైన్డ్, అటవీ భూములను గుర్తించాలి



నిజాంసాగర్(జుక్కల్): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టి అసైన్డ్, అటవీ భూములను గుర్తించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ తనిఖీ చేసి మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల వారీగా వచ్చిన దరఖాస్తుదారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. అసైన్డ్, అటవీ భూములకు సంబంధించిన దరఖాస్తులు తప్ప మిగితా భూముల సర్వే పూర్తి చేయాలని చెప్పారు. తహసీల్దార్ భిక్షపతి, గిర్దావర్ సాయిలు తదితరులున్నారు.

యోగా భవన్‌కు ఎమ్మెల్యే విరాళం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా యోగా భవన్‌కు నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కిసాన్ క్లాథ్ ఎంపోరియం ద్వారా రూ.లక్ష విరాళం అందజేసినట్లు జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. తాము కోరిన వెంటనే రూ.లక్ష విరాళం అందజేసిన ఎమ్మెల్యేకు అసోసియేషన్ ప్రతినిధులు అంజయ్య గుప్తా, రఘుకుమార్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): దీర్ఘకాలిక వ్యాధులు క్షయ, మధుమేహం, రక్తపోటు, హెచ్ఐవీ వ్యాధులపై జగదాంబతండా వాసులకు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి రాధిక అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ తమ జీవన శైలికి అనుగుణంగా అలవాట్లను మార్చుకుంటూ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జగదాంబ తండాలో బుధవారం 87 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి చల్ల సుధాకర్, ఎంపీడీవో నరేష్, ఏపీఎం శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమే

కామారెడ్డి క్రైం: డీఎస్పీగా యాకూబ్ రెడ్డి జిల్లాలో ఉత్తమ సేవలు అందించారని, ప్రతి ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణమేనని అదనపు ఎస్పీ నరసింహారెడ్డి అన్నారు. ఏడాది పాటు కామారెడ్డి ఏఆర్ విభాగం డీఎస్పీగా పని చేసి హైద్రాబాద్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్తున్న యాకూబ్ రెడ్డిని అదనపు ఎస్పీ సన్మానించి వీడ్కోలు పలికారు. శాలువాలు, పూల మాలలతో సత్కరించిన అనంతరం ఏఎస్పీ మాట్లాడారు. ఎక్కడ పనిచేసినా అంకిత భావం, నిబద్ధతలు మంచి పేరు తీసుకువస్తాయన్నారు. అందుకు యాకూబ్ రెడ్డి ఉదాహరణ అని పేర్కొన్నారు.

మంచి పథకం.. మరుగున పడింది

- ఎన్‌ఎఫ్‌బీఎస్ గురించి అవగాహన కరువు
- ఆర్థిక సాయానికి దూరంగా నిరుపేదలు
- ఏళ్ల తరబడి ఉనికే లేని పథకం



ఎల్లారెడ్డి: పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం(ఎన్‌ఎఫ్‌బీఎస్) గురించి ఇప్పటికీ ఎవరికీ అవగాహన లేకపోవడం విడ్డూరం. అకస్మాత్తుగా ఇంటి పెద్ద లేదా కుటుంబ ముఖ్య సంపాదనపరుడు మరణిస్తే ఆ కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకమే ఈ ఎన్‌ఎఫ్‌బీఎస్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం గురించి రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కొన్నేళ్లుగా ఈ పథకం మరుగున పడింది. ఇంటి పెద్ద మరణించిన దారిద్ర్యరేఖకు దిగువన కుటుంబాలకు ఎంతో కొంత ఆర్థిక సహాయం అందజేసే ఈ పథకం గురించి కొన్నేళ్లుగా అవగాహన కల్పించే వారు లేకుండా పోయారు. కామారెడ్డి జిల్లా ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు నామమాత్రంగా మాత్రమే ఈ పథకానికి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. 2015 నుంచి ఇప్పటివరకు 19 దరఖాస్తులు మాత్రమే రావడం గమనర్హం.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబంలోని 18-60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ముఖ్య సంపాదనపరుడు(పురుషుడు లేదా స్త్రీ) అకస్మాతుగా మరణిస్తే ఆ కుటుంబానికి ఈ పథకం కింద రూ.20 వేల ఆర్థిక సహాయం అందుతుంది. ఇందుకు మరణించిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం (ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్) కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను జతచేసి మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తును అధికారులు పరిశీలించి అర్హులైన కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. మరణించిన వ్యక్తి కుటుంబంలోని వితంతు భార్యకు గాని, అవివాహిత కుమార్తెలకు గాని ఈ మొత్తాన్ని అందజేస్తారు. ఆపద్బంధు పథకం కింద కాని, ఆమ్ ఆద్మీ బీమా యోజన కింద గాని లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అనర్హులని అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ఎన్నో పథకాల గురించి నిత్యం ప్రచారం చేసే అధికారగణం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఎంతో కొంత సహాయపడే ఈ పథకం గురించి కొన్నేళ్లుగా ఊసే ఎత్తడం లేదు. పేదలకు ఎంతో కొంత ఉపయోగపడే ఈ పథకం గురించి జిల్లాలో ప్రచారం చేసేందుకు అదనపు కలెక్టర్ విక్టర్ మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ పథకం కింద అర్హులైన బాధిత కుటుంబాలు దరఖాస్తులు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఎన్ఎఫ్‌బీఎస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు పూర్తి చర్యలు తీసుకుంటున్నాము. వితంతు పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న మహిళలతో, రైతు బీమా పథకం కింద లబ్ధిపొందిన కుటుంబాల సభ్యులతో మాట్లాడి ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేలా మండల స్థాయి అధికారులకు ఆదేశించాం. అవగాహన లోపం కారణంగా పేదలకు ఈ పథకం దూరమైంది. పూర్తిస్థాయి ప్రచారంతో ఈ పథకం ప్రజల్లోకి వెళ్లేలా కృషి చేస్తున్నాం.

– విక్టర్, అదనపు కలెక్టర్

పహాణి అంటే..?

మీకు తెలుసా?



పహాణి అంటే భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల ముఖ్యమైన పత్రం. దీనిని అడంగళ్ అని కూడా అంటారు.

- పహాణిలో భూమి యజమాని, సాగు చేస్తున్న వారి పేరు, సర్వే నంబర్, ఖాతా నంబర్, భూమి యొక్క విస్తీర్ణం, కొలతలు ఉంటాయి.
- భూమికి నీటి సదుపాయం(బావి, కాలువ, చెరువు), నేల రకం(సారవంతమైన, రాతి నేల) అనే స్వభావం పేర్కొనబడి ఉంటుంది.
- పహాణిలో భూమిలో సాగు చేస్తున్న పంటల వివరాలు, ఇతర ముఖ్యమైన సమాచారం ఉంటుంది.
- పహాణి భూమి యజమానికి చట్టపరమైన హక్కులను కల్పిస్తుంది. భూమి కొనుగోలు, అమ్మకం లేదా బదిలీ సమయంలో చాలా ఉపయోగపడుతుంది.
- భూమికి సంబంధించిన వివాదాలను పరిష్కరించే సమయంలో ఉపయోగ పడుతుంది.
- బ్యాంకు నుంచి పంట రుణం, ఇతర రుణాలు తీసుకోడానికి, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోడానికి పహాణి ఉపయోగ పడుతుంది.

– బాల్కొండ

ట్రా'ఫికర్'

- రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- అలంకార ప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ
- సమస్య పట్టించుకోని పోలీసు శాఖ



బాన్సువాడ తాడ్కోల్ చౌరస్తా వద్ద అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ వ్యవస్థ

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో వాహనాల సంఖ్యతో పాటు ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. దానికి తోడు ఇష్టారీతిన వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు అధికమవుతున్నాయి.ప్రధాన చౌరస్తాలలో వెహికల్స్ ఎటు నుంచి ఎటు వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి. సిగ్నల్ వ్యవస్థ ఉన్నప్పటికీ ..ఆ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించేందుకు హోంగార్డులున్నప్పటికి వారిని పట్టించుకునే వారే లేరు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి బస్ డిపో వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు వ్యాపార సముదాయాల ముందు రోడ్లపై పార్కింగ్ చేయడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.

అద్దెలకు ఆశపడి..

వ్యాపారస్తులు అద్దెలకు ఆశపడి దుకాణాల ముందు రోజు వారి వ్యాపారులకు అద్దెకు ఇవ్వడంతో ఆయా దుకాణాల ముందు వాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా తాడ్కోల్ చౌరస్తా, స్టేట్ బ్యాంకు, అంబేడ్కర్ చౌరస్తా, పాత బాన్సువాడకు వెళ్లే దారిలో, బీసీ హాస్టల్ రోడ్డు వద్ద ట్రాఫిక్ సమస్య నిత్యం ఉత్పన్నమవుతుంది. ప్రతీ గురువారం బాన్సువాడలో సంత ఉంటుంది.ఆ రోజు రోడ్డుపై వెళ్లే వారికి నరకం కనపడుతోంది.రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడంతో పాటు ఆటోలు రోడ్డుపై నిలపడంతో వచ్చి,పోయే వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.పట్టణంలో నాలుగు చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరైనప్పటికి కేవలం అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాత్రమే సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి మిగతా తాడ్కోల్ చౌరస్తా, బీసీ హాస్టల్ రోడ్డు, పాత అంగడి బజారులో ఇప్పటికీ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా పోలీసులు ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని,రోడ్లపై పార్క్ వాహనాల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మహిళ, శిశు అభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పౌష్టికాహార లోపం గల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలందరూ తప్పనిసరిగా వచ్చేలా పర్యవేక్షించాలని సీడీపీవోలు, సూపర్వైజర్‌లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు, విద్యుత్ తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా సౌరగిరి జల వికాసం..

పోడు పట్టాలున్న గిరిజన రైతులకు లాభసాటి వ్యవసాయం జరిగేలా ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం ఎంతగానో తోడ్పడుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఇందిర సౌర గిరి జల వికాసం పథకంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ పథకం ద్వారా పోడు పట్టాలు పొందిన లబ్ధిదారులకు బోరు మోటర్, సోలార్ పంప్‌సెట్లు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. లబ్ధిదారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోడానికి ఎంపీడీవో కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు. డీఎఫ్‌వో నిఖిత, అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీవో వీణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సతీష్ యాదవ్, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో మురళి, డీఏవో తిరుమల ప్రసాద్, ఉద్యానవన అధికారిణి జ్యోతి, డీటీవో శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం కామరెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్‌లను అందజేశారు. ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నిరుపేదలు సైతం గౌరవంగా సొంత ఇంటిలో నివసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్, హౌసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు రైతులకు క్షమాపణలు చెప్పాలి

- బోర్డు ఏర్పాటుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల అక్కసు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉండి బీఆర్ఎస్, 18 నెలలుగా కాంగ్రెస్ పసుపు రైతులకు ఏం చేయలేదని, వెంటనే వారికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో పుట్టి పదేళ్ల అధికారంలో ఉండి కూడా పసుపు రైతులకు ఏం చేయలేదని విమర్శించారు. జీవన్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడంలేదని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. పసుపు రైతులు నామినేషన్ వేసి ఓడించిన విషయాన్ని కవిత మర్చిపోయిందా అని ప్రశ్నించారు. 18 నెలలు గడిచినా సుదర్శన్‌రెడ్డికి లెటర్ ప్యాడ్ లేదని, మరో ఎమ్మెల్యే భూపతిరెడ్డికి క్యాంపు కార్యాలయం లేదని ఎద్దేవా చేశారు. పసుపు బోర్డుతో ప్రయోజనాలేంటో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వివరించారని, పక్కనే ఉన్న భూపతిరెడ్డికి అర్థం కాలేదా అని ప్రశ్నించారు. బోర్డుకు శాశ్వత కార్యాలయం కోసం జెడ్పీ ఆవరణలో 2 ఎకరాల స్థలం కావాలని కలెక్టర్‌కు లేఖ రాశామన్నారు. పసుపు బోర్డు క్రెడిట్ అర్వింద్‌కే దక్కుతుందని, విమర్శలు చేసే వారికి ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, గంగోనె సంతోష్, అనంత్‌రెడ్డి, నారాయణ యాదవ్, బద్దం కిషన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గుండారంలో డీఆర్‌డీవో పర్యటన



మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో సురేందర్

రాజంపేట: గుండారం గ్రామంలో బుధవారం డీఆర్‌డీవో సురేందర్ పర్యటించారు. వనమహోత్సవంలో భాగంగా గుండారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి వంశీకి సూచించారు. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని తెలిపారు. ఎంపీడీవో రఘురాం, ఏపీవో శృతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

బాన్సువాడ: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు అంగన్‌వాడీ టీచర్లను సొంత బిడ్డల్లా చూసుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ సెంటర్లలో ఆయాల ఖాళీలు భర్తీ చేయాలని, కేంద్రాలకు సామగ్రి అందజేయాలని కోరారు. సొంత అంగన్‌వాడీ భవనాలను నిర్మించాలని, కేంద్రాల్లో మరుగుదొడ్లు, నీటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు.

రెవెన్యూ దరఖాస్తుల పరిశీలన



డోంగ్లీలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ తహసీల్ కార్యాలయాన్ని బుధవారం అదనపు కలెక్టర్ విక్టర్ సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఆయన అన్నారు. కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డోంగ్లీలో మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయని అధికారులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ సాయిబాబా, సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కళాశాల అడ్మిషన్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ యూసుఫ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. పరిశుభ్రమైన తాజా కూరగాయలతో వంటలను చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరై విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతులలో పాఠాలను బోధించాలన్నారు. ప్రిన్సిపల్ సురేఖ, సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా వాసి మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లా అక్కన్నపేటకు చెందిన ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేటకు చెందిన కొత్తిన్న లక్ష్మీనారాయణ(54) జంగంపల్లి గ్రామశివారులోని విజయ సాయి ల్యాబొరెటరీలో ఫిట్టర్‌గా పనిచేస్తూ అదే గ్రామంలో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం వ్యక్తిగత పనుల నిమిత్తం అక్కన్నపేట గ్రామానికి బైక్‌పై ఉదయం వెళ్లి మధ్యాహ్నం తిరిగి జంగంపల్లికి వస్తున్నాడు. భిక్కనూరు చర్చి సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి కంటైనర్ ఢీకొట్టడంతో లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



అన్వేశ్ (ఫైల్)

కమ్మర్‌పల్లి: ఒమన్ దేశంలో ఆత్మహత్యకు పాల్పడిన కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్ గ్రామానికి చెందిన జుంబరాత్ అన్వేశ్(27) మృతదేహం బుధవారం రాత్రి స్వగ్రామానికి చేరుకుంది. దీంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. 15 రోజుల క్రితం అన్వేశ్ ఆత్మహత్యకు పాల్పడగా, మృతదేహం తీసుకురావడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ నేత సునీల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు గల్ఫ్ కన్వీనర్ భీమ్ రెడ్డితో మాట్లాడి, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు తెలిపారు. ఎంబసీ అధికారులతో మాట్లాడి మృతదేహం స్వగ్రామానికి రావడానికి కృషి చేశారు.

ఫిలిప్పీన్స్‌లో వైద్య విద్యార్థి మృతి

- గుండెపోటుతో అకాల మరణం
- పుట్టిన రోజు నాడే మృతి.. కన్నీరుమున్నీరైన కుటుంబీకులు



యోగేశ్ (ఫైల్)

మద్నూర్(జుక్కల్): కుర్లా గ్రామానికి చెందిన వడ్ల యోగేశ్(23) బుధవారం ఫిలిప్పీన్స్ దేశంలో గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పుట్టిన రోజు నాడే యోగేశ్ మృతి చెందడంతో ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుర్లా గ్రామంలో ఆర్ఎంపీగా వైద్య సేవలు అందిస్తున్న రాజేందర్‌కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. రెండో కూమారుడు యోగేశ్ ఫిలిప్పీన్స్ దేశంలో ఎంబీబీఎస్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. యోగేశ్ పది రోజుల క్రితమే కుర్లాకు వచ్చి వెళ్లాడు. బుధవారం ఫిలిప్పీన్స్‌లో కళాశాలకు వెళ్దామని బయలుదేరే సమయంలో యోగేశ్‌కు ఛాతీలో నొప్పి వచ్చిందని తండ్రికి తెలపగా దగ్గరలోని ఆస్పత్రికి వెళ్లాలని ఆయన సూచించారు. స్నేహితులు సాయంతో ఆస్పత్రికి వెళ్తుండగా మెట్లు దిగే క్రమంలో కుప్పకూలిపోయాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. యోగేశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలం తొర్తి ఆలయాల్లో దొంగతనం చేసిన కేసులో ఒకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భీమ్‌గల్ సీఐ పీ సత్యనారాయణ వివరాలను వెల్లడించారు. ఉప్లూర్ ఎల్లమ్మ, పోచమ్మ, పెద్దమ్మ ఆలయాలు, కమ్మర్‌పల్లి గుండ్లకుంట హన్మాన్, ఏర్గట్ల మండలం తొర్తిలో శుక్రవారందేవీ ఆలయాల్లో మూడు నెలల క్రితం చోరీ జరిగింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేగుర్తి గ్రామానికి చెందిన తూర్పాటి కనకయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా ఆలయాల్లో దొంగతనానికి పాల్పడింది తానేనని ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ.2,700 నగదుతోపాటు ఆలయాల్లో దొంగిలించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదనలో పాల్గొన్న ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు షౌకత్ అలీ, నవీన్‌చంద్ర, వినయ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు

- రూ.60 వేలు జరిమానా

కామారెడ్డి క్రైం: పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2022 జూలై 2న లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి నిద్రించాడు. రాత్రి 10 గంటల సమయంలో లేచి చూడగా తన 14 ఏళ్ల వయస్సు కలిగిన కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పక్కనే ఉండే గాంధీ నగర్‌కు చెందిన 20ఏళ్ల అక్కరేని శ్రీకాంత్ అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ మైనర్ బాలికతో పరిచయం ఏర్పరుచుకున్నాడనీ, ఫోన్ నెంబర్ తీసుకొని తరచూ వేధించేవాడని పోలీసుల విచారణలో తెలిసింది. 2022 జూలై 2 న బాలికకు మాయమాటలు చెప్పి రాత్రిపూట ఇంట్లో నుంచి బయటకు రమ్మన్నాడు. ఆమెను బైక్‌పై ఎక్కించుకొని మేడ్చల్ ప్రాంతానికి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి బాలిక కోసం వెతుకుతున్నారని తెలుసుకున్న శ్రీకాంత్ మూడు రోజుల తర్వాత బాలికను తీసుకువచ్చి లింగంపేట పోలీస్ స్టేషన్ వద్ద వదిలి పరారయ్యాడు. తర్వాత కొద్దిరోజులకు పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీ ఆర్ఆర్ వరప్రసాద్ నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.60 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన డీఎస్పీలు శశాంక్ రెడ్డి, శ్రీనివాస్ రావు, ఎస్సైలు శ్రీకాంత్, వెంకట్ రావు, పీపీ శేషు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రుద్రూర్: కోటగిరి గ్రామ శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన పల్లె మనోహర్(18) అనే యువకుడు బుధవారం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతికి గల కారణాలు తెలియ రాలేదని ఎస్సై పేర్కొన్నారు.